పర్యావరణానికి పొగ

- డంపింగ్ యార్డులుగా రోడ్డు మార్జిన్లు
- గ్రామాల్లో చెత్తకు నిప్పుపెట్టడంతో ప్రజలకు ఇబ్బందులు


పెనుమంట్రలో గోస్తని డ్రెయిన్ పక్కన చెత్తకు నిప్పు పెట్టిన దృశ్యం

పెనుమంట్ర: డంపింగ్ యార్డులకు స్థలాలు లేకపోవడంతో పెనుమంట్ర మండలంలో ప్రధాన గ్రామాల్లో రహదారుల పక్కన పంట కాలువలు, డ్రెయిన్ గట్లపై చెత్తను డంప్ చేస్తున్నారు. ఈ చెత్తకు నిప్పు పెడుతున్నారు. తద్వారా వచ్చే పొగతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెనుమంట్రలో డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడంతో గోస్తనీ గట్టుకు, స్టేట్ హైవే రోడ్డుకు మధ్య ఉన్న పశువుల చెరువు గట్టును డంపింగ్‌యార్డుగా వినియోగిస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీని నుంచి వచ్చే పొగ సమీపంలో ఉన్న ఇళ్లలో వెళ్లడంతో స్థానికులు, దారి కనబడక వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మార్టేరు పంచాయతీలోని ఆచంట రోడ్డులో ఉన్న శ్మశాన వాటిక పక్కనే ఉన్న స్థలంలో చెత్తను వేసి నిప్పు పెట్టడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలమూరు, భట్లమగుటూరు గ్రామ పంచాయతీలకు చెందిన చెత్తను ఆయా గ్రామ పంచాయతీలు గొంతేరు డ్రెయిన్ వంతెనకు ఇరుపక్కలా వేసి చెత్త నుంచి సంపాద తయారీ కేంద్రాలను నిర్మించి రోడ్డు పక్కనే చెత్తవేసి నిప్పు పెడుతున్నారు. దీంతో పొగ రావడంతో ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గరువు, పొలమూరు, వెలగలేరు గ్రామ పంచాయతీలు కూడా ప్రధాన రహదారులనే డంపింగ్ యార్డులుగా వినియోగిస్తున్నారు. ఇవి గ్రామానికి దగ్గరలో ఉండటంతో ఆయా ప్రాంతాల్లో గృహవాసులు ఆయా యార్డుల నుంచి వచ్చే దుర్గంధంతో పాటు, నిప్పు పెట్టడంతో వచ్చే పొగతో ఇబ్బందిపడుతూ అనారోగ్యాల పాలవుతున్నారు. అధికారులు నివాస గృహాలకు దూరంగా, మారుమూల ప్రాంతాల్లో స్థల సేకరణ చేసి, చెత్తను డంపింగ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద చెత్తకు నిప్పు పెట్టిన దృశ్యం


మార్టేరులోని ఆచంట రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డు


పొలమూరు పశువుల రేవులో పేరుకుపోయిన చెత్త

క్లుప్తంగా

వీధి వ్యాపారుల డేటా అందించాలి

నరసాపురం: పట్టణంలో వీధి వ్యాపారుల డేటా అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య అన్నారు. వార్డు వెల్ఫేర్ కార్యదర్శులు వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి సమాచారం సేకరించి ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫ్యామిలీ ఫొటో కార్యదర్శులకు అందించి సహకరించాలని వీధి వ్యాపారులను కోరారు.

అమ్మవారికి బంగారం సమర్పణ


బంగారం అందజేస్తున్న దాత

భీమవరం(ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ స్వర్ణ వస్త్రానికి భీమవరానికి చెందిన కలిదిండి వెంకట సీతారామరాజు, నిత్యశ్రీ కార్తీ దంపతులు 16 గ్రాముల బంగారం సమర్పించారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు కొప్పేశ్వరరావు ప్రత్యేక పూజ, ఆశీర్వచనాలు నిర్వహించి ప్రసాదాలు, శేష వస్త్రం ఫొటో అందించారని, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తెలిపారు.

కాళ్లకూరు వెంకన్నకు పవళింపు సేవ


కాళ్లకూరు వెంకన్నకు పవళింపు సేవ చేస్తున్న అర్చకులు

కాళ్ల: కాళ్లకూరులో కొలువైన స్వయంభు శ్రీవేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆఖరి రోజైన బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పుష్పయాగోత్సవం (పవళింపు సేవ) నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ద్వాదశ భోగాలు (12) ప్రసాదాలు సమర్పించారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

అమ్మవారికి పులిహోర నైవేద్యం


అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశంచౌక్): మెంటే వారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారికి 100 కిలోల పులిహోర నైవేద్యం సమర్పించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

పేదలకు భోజన ప్యాకెట్ల పంపిణీ


ఇందిరమ్మ కాలనీలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: సమాజంలో ఉన్న అభాగ్యులకు చేతనైన సహాయం అందించడం భగవంతుడు మెచ్చే కార్యక్రమమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమవరం పట్టణానికి చెందిన కోడే రాజు ఆధ్వర్యంలో సుమారు 200 మందికి భోజనం ప్యాకెట్లను గురువారం పంపిణీ చేశారు. తాడేరు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోడే రాజు, కోడె శివ మిత్ర బృందం, అల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

17 షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశంచౌక్): ఆర్టీసీ బస్టాండ్ పరిధిలోని 15 షాపులకు, ఉండి, కాళ్లలోని రెండు షాపులకు టెండర్ దరఖాస్తులు చేసుకోవచ్చని ఆర్టీసీ డిపో మేనేజర్ పి.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 22లోగా ఏలూరులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలని, 23న మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్ ఫారాలను బాక్స్‌లో వేయాలని, మధ్యాహ్నం 3 గంటలకు టెండర్‌దారుల సమక్షంలో బాక్సులను తెరుస్తారని తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిడ్స్ పై అవగాహన ఉంటే ప్రాణాలు దక్కించుకోవచ్చునని ఎయిడ్స్ నియంత్రణ మండలి కళాజాత సభ్యుడు ఎం.రవిబాబు అన్నారు. గురువారం ఎయిడ్స్‌పై పెంటపాడులో డప్పు కళాకారులతో అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ స్టాఫ్, గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ జయంతి


కొప్పర్రులో కాటన్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పశ్చిమడెల్టాలో నీటి ఎద్దడిని లేకుండా చేసి రైతులకు అన్నంపెట్టిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని కొప్పర్రు గ్రామ ప్రముఖుడు సర్వోదయ రైతు సంఘం నాయకుడు చినిమిల్లి వీరబాబు అన్నారు. సోమవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని సొసైటీ ఆవరణలో నిర్వహించారు. కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతులు వీరబాబు తదితరులు మాట్లాడుతూ కాటన్‌ను ఇక్కడి ప్రజలు దేవుడిగా కొలుస్తారన్నారు. అనంతరం రైతుల సంక్షేమానికి కాటన్ చేసిన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

రుస్తుంబాద డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయాలి


రుస్తుంబాద డ్రెయిన్ ప్రక్షాళన కోరుతున్న రైతులు

నరసాపురం రూరల్: సత్వరమే మురుగునీటి కాలువను ప్రక్షాళన చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పలువురు రైతులు హెచ్చరించారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. వైఎస్ పాలెం గ్రామ మాజీ సర్పంచ్ కూనపరెడ్డి రంగారావు, ప్రముఖ వ్యాపార వేత్త కలవకొలను తాతాజీ, చిన్ని, తదితర రైతులంతా డ్రెయిన్ల ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా రుస్తుంబాద మురుగు కాలువను తవ్వక పోవడం, ఆక్రమణలకు గురికావడం వల్ల రుస్తుంబాద డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న సుమారు 400 ఎకరాల రైతులు వరి సాగుకు దూరమయ్యారని తెలిపారు. నరసాపురం పట్టణం నుంచి మొగల్తూరు వరకు వెళ్లే ఈ కాలువలోకి పట్టణానికి చెందిన మురుగును మళ్లించడంతో ఈ డ్రెయిన్ మరింత ప్రమాదకరంగా తయారైందన్నారు. ఆరేళ్లుగా పంటల సాగు చేయకుండా చేలను వదిలేయాల్సి వచ్చిందని చెప్పారు. గతంలో ఈ ప్రాంతానికి పాదయాత్ర చేస్తూ వచ్చిన లోకేష్‌కు సైతం ఇక్కడి సమస్యను వివరించామని, నేడు అధికారంలో ఉన్నప్పటికీ పరిష్కారానికి దృష్టి సారించడం లేదని ఆరోపించారు. సమస్యను స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోనూ, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. డ్రెయినేజీ ప్రక్షాళనకు సుమారు రూ.3.5 కోట్లు కేటాయించామని, పనుల నిమిత్తం నరసాపురం ఎమ్మెల్యే నాయకర్‌ను సంప్రదించాలని మంత్రి నిమ్మల సూచించారని కూనపురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీతారాంపురం సొసైటీ మాజీ అధ్యక్షుడు కలవకొలను తాతాజీ, రైతులు కంబాల మామాజీ, యడ్లపల్లి వెంకటేశ్వరరావు , జద్దు ఫణీంద్ర రైతులు యడ్లపల్లి బాలాజీ, యడ్లపల్లి అర్జునుడు, మల్లికార్జునరావు, బెల్లపుకొండ పద్మారావు, మైలాబత్తుల శ్రీను, వర్దనపు సుధాకర్, యర్రంశెట్టి నరసింహరావు, యర్రంశెట్టి పాండు రంగ తదితరులు ఉన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి


సమ్మె పోస్టర్ విడుదల చేసిన నాయకులు

నరసాపురం రూరల్: ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. నరసాపురం మార్కెట్ యార్డులో ఉన్న సివిల్ సప్లై గోడౌన్ వద్ద సివిల్ సప్లై కార్మికులతో కలిసి ఆయన ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యూటీ, పని గంటలు, యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె మొదలగు చట్టాలన్నిటినీ కేంద్రంలోని బీజేపీ నీరుగార్చుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నోముల కొండ సివిల్ సప్లయి కార్మిక నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, రవి, మల్లుల రామ చక్రవర్తి, గుత్తుల రఘుబాబు, అరవ సత్యనారాయణ, ఆకన దుర్గారావు, ఆకన శ్రీనివాస్, ఆకన రాంబాబు, మేడిది రమేష్, గుడిపాటి సత్యనారాయణ, కైలా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

తణుకు ఆసుపత్రికి బాలబాలికలు


తణుకు జిల్లా ఆసుపత్రికి బాలబాలికలను పంపిస్తున్న డాక్టర్ ప్రతాప్ కుమార్

యలమంచిలి: రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలో అనారోగ్య సమస్యలు ఉన్న బాల బాలికలను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని లంకలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లు, పల్లు, చర్మం, చెవి, ముక్కు, గొంతు ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే ప్రత్యేక వైద్య పరీక్షల నిమిత్తం తణుకు జిల్లా ఆసుపత్రికి పంపుతామని చెప్పారు. గురువారం లంకలకోడేరు పీహెచ్‌సీ నుంచి తణుకు ఆసుపత్రికి పలువురు బాల బాలికలను పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి.ఎలిజబెత్, ఫార్మసిస్ట్ పాటబళ్ల వెంకటస్వామి, స్టాఫ్ నర్స్ ముత్యవల్లి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేద్దాం


పెనుమంచిలిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

పెనుగొండ: ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకుడు సిర్రా నరసింహమూర్తి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆచంట మండలం పెనుమంచిలిలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.మోహనరావు, వర్దనపు శ్రీరాములు, సత్యనారాయణ, మానుకొండ వీర్రాజు, నాగవేణి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండలో..

ఉపాధి పనికి కొలతలు పెట్టి కేంద్రం కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతోందని వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి షేక్ పాదుషా విమర్శించారు. గురువారం దొంగరావిపాలెంలో ఉపాధి కూలీలతో వేతనాల సమస్యలపై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకు దోహదం


పెనుమంట్ర : మార్టేరు శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన శేఖర్‌బాబు


నరసాపురం : పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెనుమంట్ర: గ్రంథాలయాల్లో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు విద్యార్థులు ఎంతగానో దోహదపడుతున్నాయని పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు అన్నారు. మార్టేరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. శిబిరాల్లో జనల్ నాలెడ్జ్, కథలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషుపై అవగాహన కల్పిస్తున్న రిటైర్డు ఉపాధ్యాయిని టి.సువర్ణగౌరీని అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పీటీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశ నాయకుల చరిత్ర తెలుసుకోవాలి

నరసాపురం: దేశ నాయకులు చరిత్ర ప్రతి విద్యార్థీ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు దేశ నాయకుల చరిత్రను తెలియజేశారు. నాయకుల చరిత్ర పుస్తకాలను పరిచయం చేశారు. రోటరీ క్లబ్ సభ్యుడు మురళీకృష్ణ మోటివేషన్‌పై శిక్షణ ఇచ్చారు. టీచర్ నాగలక్ష్మి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. మొత్తం 85 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు లైబ్రేరియన్ తెలిపారు.

కాలుష్యపు కోరల్లో కాలువలు


సీసలి, కోపల్లె, పెదఅమిరం వద్ద ఫ్యాక్టరీ వ్యర్థాలతో నిండిన కాలువ


ఫ్యాక్టరీ వ్యర్థ నీటితో కలుషితమైన బొండాడ మురుగు కాలువ నీరు

కాళ్ల: వ్యర్థాలతో కాలువలు కాలుష్యం బారిన పడుతున్నాయి. మండలంలోని సీసలి గ్రామంలో పెదఅమిరం గ్రామం వరకు రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న రొయ్యల పరిశ్రమల వలన కాలువలు కాలుష్యమవడంతో ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వెదజల్లుతోంది. సాధారణంగా రొయ్యల పరిశ్రమలో వ్యర్థ నీటిని రీసైక్లింగ్ చేసి బయటకు విడుదల చేయాలి. కానీ నిబంధనలను పాటించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని పలువురు పెద్దలు ఆరోపిస్తున్నారు. వ్యర్థ నీరు వదలటం వలన పరిశ్రమలను ఆనుకుని ఉన్న కాలువల్లో నీరు, మట్టి మేటలు వేసి భయంకరమైన దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. సీసలి నుంచి పెదఅమిరం వరకు రాష్ట్రీయ రహదారి వెంబడి ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత శాఖ అధికారులు గానీ గ్రామ స్థాయి అధికారులు గాని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు సీసలి గ్రామం పరిధిలో ప్రసిద్ధమైన సాయిబాబా దేవాలయం, అదే విధంగా పెద్దఅమిరం పరిధిలో పాఠశాలలు ఉన్నాయి. బాబా ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

దుర్గంధంతో వ్యాధుల భయం

పాఠశాలలో విద్యార్థులు గ్రామాల్లో ప్రజలు దుర్వాసన రావడంతో వ్యాధులు ప్రబలుతాయని భయపడుతున్నారు. పరిశ్రమలను ఆనుకొని ఉన్న కాలువలతో పాటు ప్రధాన మురుగు కాలువలు సైతం కాలుష్యం బారిన పడుతున్నాయి. ప్రధానంగా బొండాడ మురుగు కాలువలో నీరు కాషాయరంగులో మారిపోయి దుర్వాసన వస్తున్నాయి.ఎగువ భాగంలో పరిశ్రమల నుండి వ్యర్థ నీరు వదలటం వల్లే ఈ పరిస్థితి వస్తుందని పలువురు చెబుతున్నారు. ఈ నీటిని గతంలో వాడుకోవడంతో పాటు తాగటానికి కూడా ఉపయోగించే వారమని కాలువను అనుకొని ఉన్న గ్రామస్తులు చెబుతున్నారు. అయితే నేడు వాడకానికి కూడా నీటిని వాడలేకపోతున్నామని అంత దుర్గంధం వస్తోందని, దీని వలన ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క నియోజకవర్గంలో పంట మురికి కాలువల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ కాలువలు దుర్గంధంలో కూరుకుపోతున్నాయని పలువురు పెద్దలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిశ్రమల నుంచి విడుదల చేసే నీటిని రీసైక్లింగ్ చేసి బయటకు వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాలుష్యం బారిన పడకుండా కాలువలను కాపాడాలని, దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుమంట్ర: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నర్సాపురం డివిజన్ ఈఈ కె.మధుకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ పనులు చేయనున్నట్టు పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పెనుమంట్ర: ఆలమూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి మట్టిలోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పెరుమాళ్ల అబ్బులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం తణుకు ప్రైవేటు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కె స్వామి తెలిపారు. అబ్బులు పాలకొల్లు నుంచి తాడేపల్లిగూడెం మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు.

వెంకట రత్నానికి సేవా పురస్కారం

యలమంచిలి: సామాజిక, సాహితీ, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పాలకొల్లు పట్టణానికి చెందిన శ్రీ కృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నానికి ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీజేయూ) నాయకులు జాతీయ సామాజిక సేవా పురస్కారం అందజేశారు. ఇటీవల విజయవాడలో ఏపీజేయూ 5వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్ సింగ్ నేషనల్ మెమోరియల్ అవార్డు 2025 కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించారు. వెంకటరత్నాన్ని మైనారిటీ వ్యవహారాల సలహాదారులు, శాసనమండలి మాజీ అధ్యక్షులు ఎంఏ షరీఫ్ చేతుల మీదుగా సత్కరించి జాతీయ పురస్కారం అందజేశారు.

రేపు బహిరంగ వేలం

భీమవరం: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక మద్యం కేసులో పట్టుబడిన హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని వేలం వేయనున్నట్లు సీఐ కె.బలరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు భీమవరం ఎక్సైజ్ స్టేషన్ వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవలసిందిగా కోరారు.

ఇళ్ల స్థలాల నిబంధనలను సడలించాలి

భీమవరం: ఇళ్ల స్థలాల అర్హుల నిబంధనలు సడలించి, పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయాలని సీపీఎం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని ఆయన తెలిపారు. మెరక భూమి 5 ఎకరాలు, మాగాణి 2.5 ఎకరాలు లోపు ఉన్న వారిని అర్హులుగా గుర్తిస్తామని చెప్పడం హర్షనీయమన్నారు. తండ్రికి 2 లేదా 3 సెంట్ల ఇంటి స్థలం ఉంటే ఒక కొడుకుని అనర్హుడిగా ప్రకటించడం సరికాదన్నారు. ఈ నిబంధనలను సడలించాలని ఆయన కోరారు.

ఆత్మీయ కలయిక

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్‌కే రసూల్ బీబీ కలిశారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్‌కే హుస్సేన్ ఉన్నారు.